



స్వాగత ద్వారం

కోళ్లు.. కొట్లాటకు సై

» సిద్ధమైన బరులు » ప్రతి గ్రామంలోనూ పందేలకు ఏర్పాట్లు » ఇతర రాష్ట్రాల ప్రజలకు ఆహ్వానం
» బుల్లితెర నటులతో ప్రదర్శనలకు సిద్ధం » ఆఫర్‌లతో ఆకట్టుకునే ప్రయత్నాలు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. పందేలు నిర్వహించకూడదంటూ పోలీసులు అక్కడక్కడా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రచారాలు నిర్వహించారు. నిర్వాహకులు ఈ ఏడాది ఇవేమీ పట్టించుకోలేదు. నెల రోజులు ముందుగానే బరుల కోసం సన్నాహాలు చేసుకున్నారు. నేతల ఆశీస్సులు తీసుకున్నారు. అధికారులతోనూ లోపాయికారిగా సంప్రదింపులు చేసుకున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి నిర్వాహకులు మంచి జోష్ మీద ఉన్నారు. ఇప్పటికే ఇతర ప్రాంతాలనుంచి జిల్లాకు పెద్ద ఎత్తున పందెం రాయుళ్లు చేరుకున్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుంచి ఈ సారి అధిక సంఖ్యలో పందేల కోసం విచ్చేస్తున్నారు. మూడు రోజులు ఇక్కడ మకాం వేసేందుకు వసతులు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలోని అన్ని హోటళ్లు భర్తీ అయిపోయాయి. ఈ సారి ఐదు రోజుల వరకు హోటళ్లు బుక్ చేసుకున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం



నరసాపురంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి

పట్టణాల్లో వసతులు లభ్యం కావడం లేదు. అన్ని కిటకిటలాడిపోతున్నాయి. చిన్నా చితకా పందెం రాయుళ్లు కూడా ఈ సారి పుంజులు కొనుగోలు చేసుకున్నారు. బరుల నిర్వాహకులు సైతం ముందుగానే పుంజులను పోగేసుకున్నారు. భీమవరం రూరల్ మండంలో పెద్ద బరి ఏర్పాటుకు సన్నాహాలు జరిగిపోయాయి. గొల్లవానితిప్ప రోడ్‌లో డేగాపురం వద్ద ఎల్‌ఈడీ బల్బులతోనూ, వినోద కార్యక్రమాలతో బరి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి ఉండి నియోజకవర్గంలో బరి వేయాలి. గత ఏడాది అక్కడే వేశారు. ఉండి నియోజకవర్గ పెద్దలతో సయోధ్య కుదరలేదు. దాంతో భీమవరం రూరల్ మండలంలో ఏర్పాటు చేసుకుంటున్నారు. కాళ్ల మండలం పెద అమిరం, సీసలి మండలంలో పెద్ద బరులు వేసేందుదకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెద అమిరంలో ప్రారంభ పందాన్ని కోటి రూపాయలతో నిర్వహించాలని నిర్వాహకులు తహతహలాడుతున్నారు. సీసలి గ్రామంలో ప్రతి పందెం రూ. 25 లక్షల వరకు వేసే అంచనాతో అంతా ఉన్నారు.

తీరంలో జోష్

తీరప్రాంతంలో ఈ ఏడాది కోడి పందేలకు నిర్వాహకులు మంచి జోష్ మీదున్నారు. జాతీయ రహదారి సౌకర్యం ఉండడంతో నర్సాపురం నియోజకవర్గ పరిధిలో మూడు పెద్ద బరులు ఏర్పాటు చేసుకున్నారు. నర్సాపురంలో రెండు, మొగల్తూరులో ఒక పెద్ద బరి ఏర్పాటవుతోంది. ఒక్కో నేత కనుసన్నల్లో ఒకబరి నిర్వహించుకునేలా ఒప్పందం కుదిరింది. జబర్దస్త్ టీమ్‌ను కూడా వినోద కార్యక్రమాలకు రప్పిస్తున్నారు. ఆ దిశగా ముందస్తుగానే ప్రచారం చేసుకుంటున్నారు. ఆటపాటలతో సందడిగా పందేలు నిర్వహించేలా నిర్వాహకులు సర్వసన్నద్ధంగా ఉన్నారు. అక్కడ కీలక నేత అయితే పందెం రాయుళ్లకు ఆఫర్ ఇచ్చారు. అంతా తామే చూసుకుంటామని, అధికారులతో సంప్రదింపులు అవసరం లేదంటూ భరోసా ఇచ్చారు. నర్సాపురం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కోడి పందాలు దాదాపుగా ఖాయమైపోయాయి.

మహిళలతో సహా హాజరు

పాలకొల్లు నియోజకవర్గంలో కుటుంబ సమేతంగా కోడి పందేలకు హాజరుకావడం ఆనవాయితీగా వస్తోంది. యలమంచిలి మండలం కలగంపూడిలో పెద్దబరికి ఇతర రాష్ట్రాలనుంచి పెద్ద సంఖ్యలో ఈ ఏడాది పందెం రాయుళ్ల హాజరవుతున్నారు. జిల్లాలో పెద్దమొత్తంలో పందేలు కాసేవాళ్ల అదే బరికి వెళుతుంటారు. ఇక ఇరగవరం మండలంలో కొత్తపాడుకు తమిళనాడు, కర్నాటక నుంచి పందెం రాయుళ్ల విచ్చేస్తున్నారు. ఈ ఏడాది అందరికీ ఆహ్వానాలు వెళ్లిపోయాయి. అలాగే తణుకు పరిధిలో వేల్పూరు. తేతలిలో పెద్ద బరులు సిద్ధం చేసుకున్నారు. తాడేపల్లిగూడెం జాతీయ రహదారికి సమీపంలోని తోటలో పెద్ద బరికి సన్నాహాలు జరిగిపోయాయి. గత కొన్ని రోజులుగా అక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సదరు నిర్వాహకుడు ఉంగుటూరు వెళ్లిపోయారు. బాదంపూడి సమీపంలో పందేలు వేశారు. ఈ సారి తమ సొంత తోటలోనే నిర్వహించేలా పెద్దబరిని ఏర్పాటు చేసుకున్నారు. పందేలతో పాటు పెద్ద బరుల్లో గుండాట, కోతాటకు సన్నద్ధమవుతున్నారు. కోడి పందేలు నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. నిర్వాహకులు తమ పరిధిలోని నేతలతో సంప్రదింపులు చేసుకున్నారు. అధికారులతోనూ లోపాయికారిగా మంతనాలు పూర్తయ్యాయి. మొత్తంపైన ఈ సారి వినోదంతోపాటు, పందాలు జోష్ కానవస్తోంది.

పండక్కి.. మా ఊరు రండి!

» అందరినీ ఆహ్వానిస్తున్న యలమంచిలి
» గోదారి వంటకాలు.. 27 రకాల స్వీట్లు సిద్ధం
» మూడురోజులపాటు ఆటలు, విందు వినోదాలు
» బహుమతులుగా 9 గోల్డ్, సిల్వర్ కాయిన్స్

యలమంచిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రండి రండి రండీ... దయచేయండీ.. తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ! ఇది సినిమా పాటే కావచ్చు కానీ.. నిజంగానే సంక్రాంతి పండుగకు అందరినీ ఆహ్వానిస్తోంది పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి గ్రామం. ఆతిథ్యానికి మరో పేరు గోదావరి జిల్లాలైతే.. అందరినీ ఆహ్వానించడం యలమంచిలి ప్రత్యేకత! నాలుగేళ్లుగా ఈ గ్రామంలో సంక్రాంతి సంబరాలను వినూత్న రీతిలో నిర్వహిస్తున్నారు. పండుగ మూడురోజులు.. స్థానికులతోపాటే.. వారి బంధువులు, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినవారు, చుట్టుపక్కల గ్రామాలు.. ఇలా రాష్ట్ర నలుమూలల నుంచి ఎవరైనా ఆహ్వానితులే! ఇందుకు ఇక్కడి శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణం వేదిక కానుంది. ఎవరైనా సరే సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసి భోగి, సంక్రాంతి, కనుమ మూడురోజులపాటూ ఎంజాయ్ చేసి వెళ్లడమే లక్ష్యంగా ఉత్సవాలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. రోజుకు సుమారు 15వేల మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారికి సామాజిక మాధ్యమాల ద్వారా డిజిటల్ ఆహ్వానాలు పంపించారు. ఫొటోషూట్, సెల్ఫీలు తీసుకోవడానికి 27 రకాల పూలతోకూడిన వివిధ ఆకృతులను సిద్ధం చేశారు.

ఇవీ ప్రత్యేకతలు

దూరప్రాంతాల నుంచి విచ్చేసే అతిథులు ఉదయాన్నే వచ్చి సాయంత్రం వరకూ ఎంజాయ్ చేయడనికి వీరికి ఉదయాన్నే అల్పాహారం, మధ్యాహ్నం నాన్‌వెజ్ భోజనాలు, టీ, స్నాక్స్ ఏర్పాటు చేశారు. అతిథులకు స్వీట్స్ అందించి స్వాగతం పలికేందుకు సున్నుండలు, పూతరేకులు, పాకుండలు, కజ్జికాయలు, బెల్లం గవ్వలు వంటి 27 రకాల స్వీట్స్‌ను సిద్ధం చేశారు. సోమవారం ఉదయం భోగి మంట వేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. మూడు రోజులపాటూ జబర్దస్త్ టీం, ఢీ ఫేం డాన్సర్లు, సినీ సంగీత విభావరులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

9 గోల్డ్, సిల్వర్ కాయిన్స్.. మరెన్నో బహుమతులు

మహిళలు, చిన్నారులు, యువత కోసం వేర్వేరు విభాగాల్లో వివిధ పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు 9 గోల్డ్, సిల్వర్ కాయిన్స్‌తోపాటూ మరెన్నో బహుమతులుగా అందజేస్తామని నిర్వాహకులు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి) తెలిపారు. ఇవేకాక పండుగరోజుల్లో శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకునే భక్తులకు 5400 బహుమతులు సిద్ధం చేశారు. స్థానికులతోపాటూ ఏప్రాంతం వారైనా ఈ ఉత్సవాలకు కుటుంబంతో విచ్చేసి ఎంజాయ్ చేసి వెళ్లడమే లక్ష్యంగా అన్నిఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి), తాళ్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆరు పందేలు గెలిస్తే బుల్లెట్ బండి

బంగారం బహుమతుల ప్రకటన
వీరవాసరంలో నిర్వాహకుల ఆఫర్లు

భీమవరం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలంలోని కొన్ని కోడిపందేల బరుల వద్ద గెలుపొందిన వారికి వినూత్నంగా బహుమతులు ప్రకటించారు. పందెంరాయుళ్ళను ఆకర్షించేందుకు ఏకంగా బుల్లెట్ వాహనాలు, యూనికార్న్ వాహనాలు బహుమతులు అంటూ ప్రచారం మొదలుపెట్టారు. కోడి పుంజులు తెచ్చుకున్న పందెంరాయుళ్ళు లక్ష రూపాయలు చొప్పున 12 పందాలు కాయాలి. అంటే 12 లక్షలు, 12 పుంజులు అన్నమాట. ఈ పన్నెండు పందేలలో ఆరు పందేలు గెలిస్తే వారికి బుల్లెట్ వాహనం లేదా యూనికార్న్ వాహనం బహుమతిగా ఇస్తారు. అలాగే మరొక బరిలో పందేలు ఎక్కువగా గెలిచిన వారికి 8 గ్రాములు, 4 గ్రాములు బంగారు కాయిన్స్ కూడా ప్రకటించారు. జూదగాళ్ళను ఆకర్షించేందుకు నిర్వాహకులు ఈ రకంగా బహుమతులు ఏర్పాటు చేశారు. సంక్రాంతి మూడు రోజులు జూదగాళ్ల నుంచి బాగా సొమ్ము చేసుకోవాలని ఆలోచనలో ఉన్నారు.

పల్లెలు పులకింత

» సంక్రాంతికి తరలి వస్తున్న బంధు మిత్రులు » మునుపెన్నడూ లేనంత జనసందోహం » ఉమ్మడి జిల్లాలో గ్రామాలకు చేరిన సుమారు లక్ష మంది
» నాలుగు రోజులుగా మార్కెట్లు కళ కళ



సొంతూళ్లకు రావడానికి బస్టాండ్‌ల వద్ద జనం కిటకిట

పాలకొల్లు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పచ్చని పశ్చిమ గోదావరిలోని గ్రామాలు బంధుమిత్రుల రాకతో కళకళలాడుతున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని మునుపెన్నడూ లేనంతగా ఈ ఏడాది గ్రామాలను బంధు మిత్రులు ముంచెత్తుతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి అధిక సంఖ్యలో జిల్లాకు తరలి వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణ ప్రాంతాలకు చేరిన ప్రజల కన్నా, ఇప్పుడు గ్రామాల్లోనే హడావుడి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా అంతటా సాంప్రదాయ కోడి పందేలకు సన్నాహాలు చేయడంతో గ్రామాలలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఉత్సాహం చూపుతున్నారు. గ్రామాలలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్లు, కబడ్డీ పోటీలు, ఇంకా పలు సాంప్ర దాయ క్రీడలు భారీగా న్విహిస్తు న్నారు

రైతు మోములో సంతోషం

గత 5ఏళ్ళగా కష్టనష్టాలను చవిచూసిన రైతులకు ఈ ఏడాది సార్వా సాగులో ధాన్యం మిల్లులకు తోలిన 24 గంటలలనే ధాన్యం సొమ్ములు రైత ఖాతాలకు జమ కావడంతో రైతుల్లోనూ ఉత్సాహం వెల్లి విరిసింది. మరోవైపు కొబ్బరి ధర గణనీయంగా పెరిగింది. దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ ఆక్వా రంగం సైతం రొయ్య ధర పెరగడంతో ఉపందు కుంది. మొత్తంగా పండుగ వేళ, రైతు మోములో ఆనందం కనిపించడంతో మార్కె ట్‌కు కళ వచ్చింది. బంధువులుంటే ప్రాణ మిచ్చే జిల్లా వాసులు తమ ఇంటికి వచ్చిన బంధువులను ఆత్మీయంగా పలకరిం చడమే కాకుండా పిండి వంటలు,విందు భోజనాలే కాకుండా నూతన వస్త్రాలు పెట్టా లనే సాంప్రదాయంతో మార్కెట్‌కు రావడం తో గత 2, 3 రోజులుగా వస్త్ర దుకాణాలు కళకళలాడు తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సాంప్రదాయ కోడి పందేలు వీక్షించడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహి ళలకు కోడి పందేల బరులు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పిండి వంటలతో గ్రామీణం దూర ప్రాంతాల నుంచి వసున్న బంధుమిత్రులకు స్వాగతం పలుకుతోంది.

తాడేరులో బొమ్మల కొలువు

భీమవరం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలు ఈ ఏడాది ఆకర్షణగా మారాయి. నేటి తరానికి పూర్వకాల విధానాలు అప్పటి బ్రతుకుదెరువులు తెలిపేలా ఏర్పాటు చేసిన బొమ్మల సెట్టింగ్ ఆకట్టుకున్నాయి. తాడేరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ బొమ్మల కొలువు చిన్నారులను ఆకర్షించే విధంగా ఉన్నాయి. అప్పటి కాలపు గెడల బద్ధలతో తయారు చేసిన బుట్టలు, చిన్న పూరిగుడిసెలు, దేవాలయాలు, కొబ్బరి దడులు అందంగా కనిపించాయి. మహిళలు బిందెలతో నీరు తెచ్చే బొమ్మలు మరింత ఆకర్షణగా నిలిచాయి.









మత్స్యకారులకు వేట నిషేధ భృతి భరోసా

జిల్లాలో 1730 మంది మత్స్యకారులకు లబ్ధి



నరసాపురం, 12 జనవరి (ఆంధ్రజ్యోతి): అధికారం లోకి వస్తే సముద్ర వేట సాగించే మత్స్యకారులకు నిషేధ సమయ ంలో ఇస్తున్న భృతిని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నేరవేర్చింది. ప్రస్తుతం ఇస్తున్న భృతిని రూ.10వేలను రూ.20వేలకు పెంచుతూ ఇటీవల కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఈకారణంగా జిల్లాలోని 1730 మంది లబ్ధి పొందనున్నారు. ఈ భృతిని నిషేధ సమయంలో కాకుండా ముందుగానే అందించాలని నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లోనే గుర్తింపు పొందిన మత్స్యకారుల ఖాతాల్లో సొమ్ము జమ కానుంది. గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల భృతిని పెంచుతామని హామీ ఇచ్చిందే తప్ప ఐదేళ్లల్లో ఆ ఊసే ఎత్తలేదు. కనీసం వారికి బోట్లు, వలల కొనుగోళ్ళల్లో ఇస్తున్న సబ్సిడీల్లో కూడా ఎగనామం పెట్టింది. గత ఏడాది భృతిని ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో మత్స్యకారులు వేటాడాలంటే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటిన్నంటిని గుర్తించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గతంలో తాము అమలు చేసిన పథకాలన్నింటిని వర్తింపజే స్తామని హామీ ఇచ్చింది. భృతిని కూడా పెంచుతామని హామీ ఇచ్చిం ది. దానికి అనుగుణంగా ఆరు నెలల్లో దీన్ని అమలు చేయడంతో సముద్ర వేట సాగించే మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి వస్తుందంటే....

జిల్లాలో దాదాపు 2లక్షల మంది పైనే మత్స్యకారులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గోదావరి, పంట కాల్వలు, ఉప్పుటేరుల్లో వేట సాగిస్తుంటారు. వీరికి విరామం ఉండదు. అన్ని సమయాల్లో వేట సాగించవచ్చు. అయితే సముద్ర వేట సాగించే మత్స్యకారులకు మాత్రం ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు నిషేధం అమల్లో ఉంటుంది. ఎందుకంటే ఆ సమయంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరుగుతుంటుంది. వేట సాగిస్తే సంపద హరించిపోతు ందన్న ఉద్దేశంతో ప్రతి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 రోజుల పాటు వేట నిషేధం అమలు చేస్తుంటాయి. ఈకోవలో నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సముద్ర వేట సాగించే సుమారు 1730 మత్స్యకారులకు ఉపాధి ఉండదు. వీరికి ప్రభుత్వం పెంచిన భృతి రూ.20వేలు ఈ ఏడాది నుంచే అందనుంది. దీనిపై జిల్లా మత్స్యశాఖ జేడీ ప్రసాద్ మాట్లాడుతూ భృతిని పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకొంది. దీనికి సంబంధించి త్వరలో జీవో విడుదల అవుతుందన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

భీమవరం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారంనాడు రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భోగి పండుగ దృష్ట్యా రద్దు చేశామన్నారు. అందు వల్ల సమస్యలను విన్నవించేందుకు ఫిర్యాదు దారులు రావద్దని కోరారు.

నగల దుకాణంలో చోరీ

రూ.2.5 కోట్ల ఆభరణాలు కొట్టేశారు
దుకాణం వెనుకవైపు గోడకు రంధ్రం
సీసీ కెమెరాలు ధ్వంసం
ఏలూరులో కలకలం

5

నేటి నుంచి మావుళ్ళమ్మ ఉత్సవాలు

వచ్చే నెల 14 న అన్నసమారాధనతో ఉత్సవాల ముగింపు

6



మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షూపై దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షూ లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్స్ట్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాధరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షూ, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆ విషయం మరోసారి రుజువైంది

– బాబీ కొల్లి




బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.







భీమవరం మండలం తాడేరులో సంక్రాంతి సంబరాల వేదిక ద్వారం

ఆరోజుల్లో సంక్రాంతి

పెద్దలు చెప్పిన ముచ్చట

తెలుగు ఇళ్లలో సంక్రాంతి పెద్ద పండుగ. గ్రామాల్లో నెల రోజుల ముందు నుంచి సందడి. పంట చేతికొచ్చే సమయం కావడంతో ఒకవైపు పొలం పనుల హడావుడి. మరోవైపు ఇళ్లలో పండుగ పనులు. ఇంట్లో శుభ్రంగా దులుపుళ్లు.. రంగులు వేయడం.. పేడతో అలకడం.. ముగ్గులు వేయడం ఒకటే హడావుడి. ధనుర్మాసం అంతా హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల సందడి, కొమ్మదాసర్ల సరదా సంభాషణలు పల్లెల్లో పనుల హైరానాలో సైతం హాయిగొలిపే సందడి. పండుగకు వారం రోజుల ముందు నుంచి కొత్త అల్లుళ్లు, కుమార్తెల రాక. పిండి వంటలు, నూతన వస్త్రాలు, కానుకల పందేరం.. ఇదంతా ఐదు దశాబ్దాల క్రితం బాగా ఆస్వాదించాం అంటున్నారు వయసులో పెద్దవారు. వారి చిన్నతనం సరదాగా గడిపిన రోజులు గుర్తుకు తెచ్చుకుని ఇప్పటి పండుగ తీరుపై పెదవి విరుస్తున్నారు. ఆ రోజులు తలుచుకుంటే ఇప్పటికే ఎంతో పరవశం అంటూ వారి మాటల్లోనే..

ఏలూరు రూరల్, నరసాపురం, చింతలపూడి, పాలకొల్లు అర్బన్, ఉండి, ఇరగవరం, పెంటపాడు ఆకివీడు, మొగల్తూరు



తాడేరులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బొమ్మలు

సంప్రదాయం.. సరదా



పేద, మధ్య తరగతి, ధనికవర్గం తేడా లేకుండా సరదాగా సంప్రదాయ బద్ధంగా ఆనందోత్సాహాలతో జరుపుకునేవారం. పండుగ మూడు రోజులు గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణం వెల్లివిరిసేది. బంధుమిత్రులతో కలిసి జరుపుకునేవారం. నేడు పట్టణీకరణతో పల్లెసీమల్లో కూడా సంక్రాంతి సరదా తగ్గింది. పల్లెల ముఖచిత్రం మారిపోయింది. నేటికి కొంతమంది మన గొప్ప సంప్రదాయాలను కాపాడుతున్నారు. ఇటువంటి పండుగను ప్రజలంతా కలిసి జరుపుకుని సంప్రదాయాలను కాపాడుకునే విధంగా సంక్రాంతి కార్యక్రమాలు రూపొందించాలి.

జి.రాణి, వట్లూరు

పెద్ద పండుగ



సంక్రాంతి అంటే పెద్ద పండుగ అని పిలిచేవారం. కుటుంబ సభ్యుల సరదా కబుర్లు, ఆటపాటలు, పిండి వంటలతో ఆనందం పంచుకునే వారం. ప్రస్తుతం పల్లె, పట్టణాల్లో సంప్రదాయం మాటున కోడిపందేలు, పేకాట, గుండాటకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పండుగ మూడు రోజులు పల్లెసీమల్లో బంధుమిత్రులతో సరదాగా గడిపేవారం. ఇప్పుడు అంతా ఫ్యాషన్‌గా మారింది. సంస్కృతి, సంప్రదాయాలను మనం ముందు తరాల వారికి అందించాలి.

ఎం.సత్యనారాయణ, సత్రంపాడు

సంక్రాంతి అంటే.. బంధువుల పండుగ



సంక్రాంతికి ఇల్లంతా బంధువులతో సందడి. ఎక్కడ ఉన్నా పండుగకు పది రోజుల ముందుగానే స్వగ్రామాలకు వచ్చేవారు. పండుగ తర్వాత కూడా వారం రోజుల వరకు సందడి ఉండేది. ఇక కొత్త అల్లుళ్లు ఉంటే వారికి ప్రత్యేకంగా చూసుకునేవారు, అల్లుడికి కానుకలు, నూతన వస్త్రాలు పెట్టేవారు, నాలుగైదు రకరకాల వంటకాలతో భోజనం. ఇప్పుడు మాత్రం కొత్త అల్లుడికి 120 రకాల వంటలు వండి హోదా చూపించుకోవడం అనవాయితీగా మారింది. ఈ కాలంలో పండుగ అంటే అంతా ఖర్చుతో కూడినదే.

అత్మూరి వెంకట నరసయ్య, విశ్రాంత తహసీల్దార్, నరసాపురం

నెల రోజుల నుంచి హడావుడి..



సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి సరదా. చుట్టాలకు, దూర ప్రాంతాల్లో పిల్లలను రమ్మని ఉత్తరాలు రాసేవారు. ఇంటికి రంగులు, సున్నాల పనులు, నూతన వస్త్రాలు, సామాన్ల కొనుగోలు, పిండివంట హడావుడి ఉండేది. పండుగకు వారం నుంచి బంధువుల రాకపోకల సందడి.. రాత్రి 12 దాటినా సరదా కబుర్లు. సాయంత్రమైతే మహిళలు పేడతో కల్లాపు వేసి ముగ్గులు పెట్టేవారు.

చెరుకూరి తాతారావు, నరసాపురం

సంప్రదాయానికి ప్రతీక



సంక్రాంతి ప్రజలందరి పండుగ. తెలుగు సంప్రదాయానికి పతీక. ఎక్కడెక్కడో పట్టణాల్లో ఉండే బంధువులు, స్నేహితులను పల్లెలకు రప్పించే పండుగ. జరిగిపోయిన ఏడాదికాలం విశేషాలను మూడు రోజులపాటు ముచ్చటించుకునే కుటుంబాల వేదిక. గ్రామాల్లో కొన్ని చోట్ల జరిగే సంప్రదాయ కోడి పందేలు కాస్తా పోటీ పందేలుగా, జూద క్రీడలుగా మార్చడం, అదిలేనిదే సంక్రాంతి ఏముందని చెప్పడం కొన్ని ప్రాంతాల్లో ఆనవాయితీగా మారుతుంది.

డోకల రాము, వెలమపేట, చింతలపూడి

రైతుల పండుగ



సంక్రాంతి అంటే రైతుల పండుగ. పంటలు చేతికి వచ్చే కాలం. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయం వెల్లివెరిసే కాలం. దుక్కి దున్ని ఎద్దులను అలంకరించి హారతి ఇస్తారు. ఇంటిల్ల పాది తెల్లవారుజామునే భోగిరోజు భోగి మంటలు, పాలు పొంగలి చేస్తారు. పండుగ రోజు అరిసెలు, జంతికలు ప్రత్యేకం. ఇంటిల్లిపాది కొత్త వస్త్రాలు ధరిస్తారు. కనుమ, ముక్కనుమ ప్రతీ ఇంటా జరుపుకునే ఈ సంప్రదాయంతో ఊరంతా వేడుక, గ్రామాలన్నీ పండుగమయం అవుతాయి.

యర్రంశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ నామవరం

సందడే సందడి



సంక్రాంత్రి పండుగకు సందడే సందడి. పండుగకు నెల రోజుల ముందు నుంచే ఇంట్లో ఒకటే హడావుడి. అలుళ్ల, కుమార్తెల రాక పండుగ ప్రత్యేకం. అత్తవారింట అల్లుళ్లకు పిండి వంటకాలు, నూతన వస్త్రాలతో గొప్ప సరదగా ఉండేది. ఆరోజులు మరువలేము. ఇపుడు అది ఎక్కడ కనిపిస్తోంది. ఆరోజులు జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తుంటాయి. ప్రస్తుతం ఒకరోజు, రెండు రోజులే సరదా.

కొండవీటి సాంబశివరావు, చెరుకువాడ, ఉండి మండలం

ప్రయాణం కూడా సరదా



ఆరోజుల్లో సంక్రాంత్రి సెలవులు వస్తున్నాయంటే ముందుగానే ఊర్లు వెళ్లడానికి ప్రణాళికతో వుండేవాళ్లం. కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణం చేయాల్సి వచ్చేది. ప్రయాణంలో కూడా పండుగ హడావుడితో అంత గమ్మత్తుగా వుండేవారు. ఇప్పుడు అతా ఆధునికత. ఎక్కడ వారు అక్కడే. ఊరు వెళ్లినా మోటర్‌సైకిల్, కారులో ఉదయం వెళ్లడం సాయంత్రానికి చేతులు ఊపించుకుంటూ ఇంటికి వచ్చేయడం అంతే.

గుండాబత్తుల సుబ్బారావు, ఉండి

పాడిపంటలతో పండుగే..



ఆ రోజుల్లో సంక్రాంతి పాడి పంటలతో పెద్ద పండుగే. పిల్లలు, పెద్దలు అందరూ కలసి ఆనందంగా పండుగ జరుపుకునే వాళ్లం. గ్రామాల్లో గంగిరెద్దులు, హరి దాసు కీర్తనలు, బుడ బుక్కల వేషధారణలతో కళకళలాడేవి. ఇప్పుడు గ్రామాల్లో కూడా పాశ్చాత్యపోకడలే. పని ఒత్తిడిలో పడి పండుగ కొంత సమయాన్ని కూడా కేటాయించడం లేదు. వచ్చినంత హడావుడిగా వెళ్లిపోతు న్నారు. రైతులు కూడా చేతిలో తగినంత డబ్బు లేక సంక్రాంతి పండుగను గతంలో లా జరుపుకోలేకపోతున్నారు.

నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, పెంటపాడు

సరదా.. హడావుడి



సంక్రాంతి వస్తోందంటే నెల రోజుల నుంచి సందడి.. హడావుడి. ఉండేది. ఒక వైపు వరి మాసూళ్లు, ఇళ్లకు సున్నాలు, పేడలతో అలకడం, ముగ్గులు పెట్టుకోవడం. మనవలు భోగి మంటల్లో వేయడానికి ఆవు పేడతో పిడకలు తయారుచేయడం, భోగిపళ్ల పేరంటాలు, బొమ్మల కొలువులు. అల్లుళ్లు, కూతుళ్లకు, మనవలకు కొత్తబట్టలు, పిండివంటలతో అసలు ఖాళీ ఉండేది. కాదు, నేడు ఆ వాతావరణం కనుమరుగవుతోంది. సంప్రదాయాలు ఎవరూ పట్టించుకోవడం లేదు.

గోపరాజు సీతామహాలక్ష్మి, పాలకొల్లు

నెల రోజుల ముందే ప్రణాళిక



సంక్రాంతి పండుగ వస్తుందంటే నెల రోజుల ముందు నుంచి ప్రణాళిక సిద్ధం చేసుకునేవాళ్లం. పంట చేతికొచ్చే సమయం కావడంతో డబ్బులు మసిలేవి. మాది తొమ్మిది మంది అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్లతో మాది ఉమ్మడి కుటుంబం. అన్నదమ్ముల పిల్లలు, అక్క చెల్లెళ్ల పిల్లలు అందరూ సంక్రాంతికి మొగల్తూరు వచ్చేవారు. ప్రత్యేక పిండి వంటలు తయారు చేసేవారు. నూతన దుస్తులు అందరూ కుట్టించుకునేవాళ్లం. రాజగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి నెల రోజులు నిర్వహించే సేవల్లో పాల్గొనేవాళ్లం. **- అనంతపల్లి గాంధీ, మొగల్తూరు**

సంక్రాంతి పిండి వంటల్లో ఆరోగ్యం



సంక్రాంతి పండుగ అంటేనే పిండి వంటలు. కుటుంబంలో మహిళలంతా వంటకాల్లో పడితే పొరి గింటి మహిళలు సహాయపడేవారు. వాకిట్లోనే పుల్లల పొయ్యి ఏర్పాటు చేసి మగవారు గొడ్డలితో పుల్లలను నరికి ఇస్తుంటే వంటలు వండే తీరు చూడముచ్చట గా ఉండేది. సంక్రాంతి పిండి వంటలు జంతికలు, బెల్లం నువ్వులతో చేసే నువ్వు ఉండలు, మినుములతో చేసే సున్నుండల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయి. నేటి కాలంలో ఇళ్ళల్లో పిండి వంటకాలే జరగడంలేదు. ఇప్పుడు ఒకరోజు ముందు స్వీట్‌స్టాల్స్‌కు వెళ్ళి కొనుక్కునే పరిస్థితి ఇపుడు ఉంది. **- ఆకేటి నరసింహారావు, తూర్పువిప్పర్రు**

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ లేదు



గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలుండేవి. అందరూ కలిసి జీవించేవారు. ఆరోజుల్లో ఎక్కువ మంది సంతానం ఉండేవారు. కుటుంబ సభ్యులంతారెండు రోజులు ముందుగా భోగిమంటకు కావాల్సిన సామగ్రి సేకరించి మంటలేసేవారు. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు లేవు. తల్లిదండ్రులు ఒకచోట, పిల్లలు ఒకచోట ఉంటున్నారు. పిల్లలు ఇతర రాష్ట్రాల నుంచి రావడం గగనం. వాళ్ల వచ్చినా కుటుంబ సభ్యులను పలకరించడం, వారితో గడిపే సమయం తక్కువ. కోడిపందేలు జూదంలా మారాయి. **- చుండూరు వెంకట సత్యనారాయణ, ఆకివీడు**

పిండి వంటలు దుకాణాల్లోనే..!



ఏలూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ముందుగా గుర్తొచ్చేవి సంప్రదాయ రుచులు. పల్లెల్లో అరిసెలు, కజ్జికాయలు, పూర్ణం బూరెలు, పొంగడాలు, సున్నుండలు, జంతికలు పండుగ పిండివంటలు. ప్రస్తుతం అన్ని రకాల పిండి వంటలు దుకాణాలకే పరిమితం అయ్యాయి. అభిరుచి, ఆహా, హాయ్, స్వగృహ తదితర సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి వంటకాలను తయారుచేసి అందిస్తున్నారు. ప్రత్యేక ప్యాక్‌లు, బుట్టలు, బకెట్లతో ఎవరి స్టైల్లో ఆయా కంపెనీలు పెద్ద ఎత్తున తయారు చేసి మార్కెట్‌లోకి సిద్ధం చేశాయి. నేతి పూతరేకులు, జీడిపప్పు మిక్స్‌డ్ పూతరేకులు, బెల్లం, పంచదారతోనే వేర్వేరుగా తయారు చేశారు. గత కొంత కాలంగా మాల్‌పూరి, బొబ్బట్లు తయారీ కూడా పెద్ద ఎత్తున ఊపందుకుంది.

ఆనాటి సందడి లేదు..

పండుగకు నెల ముందు నుంచి పిండి వంటలు కుస్తీపట్టేవారు.. తయారు చేయడంలో అలుపుసొలుపు లేకుండా కబుర్లతో చకచకా చేసేవారు. ఇళ్లలో ప్రత్యేక కట్టెల పొయ్యి ఏర్పాట్లు ఉండేవి. పేడ, ముగ్గులతో పొయ్యిలను అలికి అందంగా ముస్తాబు చేసేవారు. స్వయంగా బియ్యం నానబెట్టి, దాన్ని దంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో వంటకాలు చేసేవారు. బామ్మ, అమ్మమ్మలు ఉత్సాహంగా వంటలతో మనస్సుకు అభిరుచులను పంచిపెట్టేవారు. ప్రస్తుతం అతి తక్కువ మంది ఇళ్లల్లోనే సంక్రాంతి వంటకాలు ఇళ్లలోనే చేసుకోవడం కనిపిస్తోంది. పండుగ రోజుకు ముందు హడావుడిగా బంధువులు రావడం, 3, 4 రోజులకే తిరుగుముఖ పడుతుంటంతో పిండి వంటల సంస్కృతి మూలన పడింది. సంప్రదాయంగా పెద్దలకు మూలన నువ్వులతో చేసిన అరిసెలు, పోకుండలు తదితర వంటల పెట్టడం ఆనవాయితీగా రావడంతో కొద్ది సంవత్సరాలుగా రెడీమేడ్‌గా తయారు చేసినవే ఇళ్లలోకి తెచ్చుకుని వాడుకోవాల్సి వస్తోంది. అన్ని రకాలు స్వీట్లుకలిపి పావుకేజీ, కేజీ, బుట్టలు, బాక్సుల్లో ప్యాక్‌ల చేసి అందిస్తున్నారు.

నాన్‌వెజ్ పచ్చళ్లు కూడా..

కొత్త అల్లుళ్ల నుంచి ఏది కొరత అనిపించుకోకుండా ఉండేందుకు ముందుగానే ఇళ్లల్లోనే బయట తయారు చేసిన నాన్‌వెజ్, ఇతర రకాలు పచ్చళ్లతో రుచులు ఆస్వాదనకు సమాయత్తం అవుతున్నారు. భీమవరం ప్రాంతం నుంచి అన్ని ప్రాంతాలకు రొయ్య, నాటుకోడి, మటన్, ఫిష్ తదితర రకాల పచ్చళ్లకు డిమాండ్ కూడా అమాంతంగా పెరిగింది. అక్కడి బ్రాండ్ పేరుతో లోకల్‌గా నాన్‌వెజ్ పచ్చళ్ల తయారీ కూడా పెరగడంతో సంక్రాంతి రుచుల్లో వీటికీ ప్రత్యేకత నెలకొంది. కొనుగోళ్లు పెరిగాయి.



గంగిరెద్దుకు క్యూఆర్ కోడ్!

సంప్రదాయ సంక్రాంతి పండుగ డిజిటల్ అడుగులు వేసింది. పండుగ సందడిలో స్మార్ట్‌ఫోన్ కీలకం అయింది. వస్త్రం, వంటకం, సందడి, హడావుడి అంతా ఫోన్‌లో నిక్షిప్తం అవుతోంది. గంగిరెద్దులకు ఇచ్చే కానుకలు సైతం ఫోన్‌తో డిజిటల్ చెల్లింపులు సాధారణం అయ్యాయి. గంగిరెద్దు తలపై రంగుల అలంకారాల మధ్యలో 'క్యూఆర్ కోడ్' పట్టుకుని వస్తోంది. ఏలూరులో డూడూ బసవన్నయూపీఐ స్కానర్‌తో ప్రత్యక్షమవ్వడం అందరిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఏలూరు డేటా కాంప్లెక్స్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దు కొమ్ములకు యూపీఐ స్కానర్ ఏర్పాటు చేశాడు. డూడూ బవసవన్నల విన్యాసాలతో అబ్బురపడిన వారు యూపీఐ స్కానర్‌తో కానుకలు చెల్లించారు.

ఏలూరు రూరల్, ఆంధ్రజ్యోతి

నగల దుకాణంలో చోరీ

రూ.2.5 కోట్ల ఆభరణాలు కొట్టేశారు

- దుకాణం వెనుకవైపు గోడ తవ్వి దొంగతనం
- పక్కా వ్యూహంతో వ్యవహరించిన దుండగులు
- సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు
- సొమ్మసిల్లి పడిపోయిన దుకాణ యజమాని
- ఏలూరు నగరంలో కలకలం



పోలీసు జాగిలంతో క్లూస్ టీం పరిశీలన

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి వేళ దొంగలు గోనె సంచులు పట్టుకుని రెక్కీ నిర్వహించి షాపులను పగులగొట్టి నేరం చేయడం లేదా ఆ షాపు గోడలను పలుగులతో తవ్వేసి లోపలకు ప్రవేశించి దొంగతనాలకు పాల్పడడం.. సమీపంలోనే పోలీసు వాహనం, పోలీసులు ఉండడం వంటి దృశ్యాలు సినిమాల్లో చూస్తూ ఉంటాం. అదే తరహాలో ఏలూరు నగరంలో శనివారం రాత్రి ఒక జ్యూవెలరీ షాపులో చోరీ జరిగింది. ఆ దుకాణంలో దొంగతనం తీరు వ్యాపారులనే కాదు స్థానికులను సైతం భయపడే విధంగా ఉంది.

ఏలూరు నగరంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మెయిన్ బజార్‌లో ఒక జ్యూవెలరీ షాపులో దొంగలు గోడను తవ్వి రంధ్రం పెట్టి వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. అపహరించిన నగల విలువ సుమారు రెండున్నర కోట్ల రూపాయల విలువ ఉంటాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మానేపల్లి మారుతీ రఘురామ్ మెయిన్‌బజార్‌లో లోకేశ్వరి జ్యూయలర్స్ అండ్ బ్యాంకర్స్ వెండి, బంగారు నగల వ్యాపారం చేస్తున్నారు. మరోవైపు వెండి, బంగారపు వస్తువులను తాకట్టు పెట్టుకుంటూ వ్యాపారం చేస్తున్నారు. షాపు ముందు ఎంతో అందంగా కనిపించిన ఆ షాపు వెనుక మాత్రం ఓ పాడుబడ్డ పురాతన భవనం. దొంగలకు అదే కలిసి వచ్చింది. బయటకు మాత్రం ప్రహరీ గోడ, ఓ చెక్క తలుపు ఉన్నాయి. దొంగలు ముందుగానే రెక్కీ నిర్వహించి ప్రణాళిక ప్రకారం ఈ దొంగతనానికి పాల్పడ్డట్లు స్పష్టమవుతుంది.

మారుతీరఘురామ్ యధావిధిగా ఈనెల 11న రాత్రి 10.30 గంటలకు షాపును కట్టివేసి తాళాలు వేసుకుని వెళ్లారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు షాపు వద్దకు వచ్చి తాళాలు, గేట్లు, తలుపులను తెరచి చూసేటప్పటికీ ఒక్కసారిగా కుప్పకూలి మారుతీ రఘురామ్ కిందపడిపోయాడు. ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకోవడంతో షాపులోపల గోడకు పెద్ద రంధ్రం ఉండడాన్ని గమనించారు. వెంటనే ఈ సమాచారాన్ని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణకు అందించారు. దీంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. క్లూస్ టీమ్, పోలీసు జాగిలాలతో పరిశీలింపచేయించారు. సుమారు పాతిక కేజీల వెండి, రెండున్నర కేజీల బంగారం అపహరణకు గురైనట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నారు. వెనుకవైపు ఉన్న పురాతన శిధిలం భవనం లోపలకు దొంగలు ప్రవేశించారు. భయంకరంగా ఉన్న ఆ లోపల నుంచి నాలుగు అడుగుల మందం కల్గిన గోడకు రంధ్రం పెట్టి షాపులోపలకు ప్రవేశించారు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మరీ నగలను పట్టుకుపోయారు.

రంగంలో దిగిన పోలీసు బృందాలు

జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక వైపు పోలీసు జాగిలం ఆ షాపులోకి ప్రవేశించి అక్కడ నుంచి షాపు వెనుకవైపు వెళ్ళి రంధ్రం పెట్టిన ప్రదేశానికి వెళ్లింది. ఆ షాపు వెనుకవైపు రోడ్డు, ముందువైపు రోడ్డులో పోలీసు జాగిలం తిరిగింది. అంటే ఆ దొంగ ముందుగానే రెక్కీ నిర్వహించినట్లు గుర్తించారు. మరోవైపు క్లూస్ టీమ్ కూడా అక్కడకు వచ్చి పలు ఆధారాలు సేకరించారు. ఏలూరు డీఎస్పీతో పాటు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, సీసీఎస్ సీఐ రాజశేఖర్, భీమడోలు సీఐ యుజె విల్సన్, వన్‌టౌన్ ఎస్‌ఐలు నాగబాబు, మదీనా బాషా, వారి సిబ్బంది రంగంలోకి దిగారు. నగల దుకాణం పరిసర ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజిలను కూడా పోలీసు బృందాలు పరిశీలిస్తాయి. పలు వ్యాపారులు అక్కడకు చేరుకుని ఆ షాపులో చోరీ సంఘటన చూసి దిగ్భ్రాంతి చెందారు. ఏలూరు నగరంలో ఈ సంఘటన వ్యాపారుల్లో తీవ్ర కలకలం సృష్టించింది.



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, దుకాణం వెనుకవైపు గోడకు రంధ్రం

మద్యానికి సొమ్ము ఇవ్వలేదని.. ఆత్మహత్య

పెదవేగి/ఏలూరు క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి సొమ్ము ఇవ్వలేదని ఒక వ్యక్తి పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. లక్ష్మీపురం గ్రామానికి చెందిన బడిపాటి రవికుమార్ మద్యానికి బానిసై సొమ్ముకోసం భార్యను వేధిస్తున్నాడు. శనివారంరాత్రి రవికుమార్ మద్యం తాగడానికి భార్య వెంకటేశ్వరమ్మను సొమ్ము అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో రవికుమార్ శనివారంరాత్రి పురుగుమందు తాగాడు. తెల్లవారుజామున వాంతులతో అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని కుటుంబీకులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. రవికుమార్(45) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి.. చికిత్స పొందుతూ మృతి

ముసునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ ఎం.చిరంజీవి ఆదివారం కేసు నమోదు చేశారు. చెక్కపల్లికి చెందిన మొక్కపాటి సురేష్(35) కాటేపల్లి మహేష్ దగ్గర 2021లో రూ.4లక్షలు అప్పు తీసుకున్నాడు. నగదును విడతల వారీగా చెల్లించినా మహేశ్ కొన్ని ఖాళీ చెక్కులు, నోట్లు మాత్రమే తిరిగి ఇచ్చాడు. తనవద్ద ఉన్న నోట్లు చూపి ఇంకా రూ 2లక్షలు ఇవ్వాలని సురేష్‌ను బెదిరిస్తున్నాడు. మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 22న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సీతంపేట రైల్వే గేటు సమీపంలో సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఆదివారం ఉదయం రైల్వే ఎస్‌ఐ పి.సైమన్‌కు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సిమెంటు రంగు పొట్టి చేతుల టీ షర్టు ధరించి ఉన్నాడు. రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కల్తీ మద్యం, సారాపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీ మద్యం, సారాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య జిల్లా ప్రజలకు సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయించినా, సారా విక్రయించినా దాడులు కొనసాగిస్తామన్నారు. ఇటీవల భీమవరంలో చెన్నై నుంచి కల్తీ మద్యం తీసుకువచ్చి ఖరీదైన మద్యం బ్రాండ్లు బ్లాక్‌డాగ్, జానీవాకర్ తదితర పేర్లతో విక్రయించారని, వీటిని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారన్నారు. అవి నకిలీ బాటిల్స్ అని గుర్తించడం జరిగిందన్నారు. ఇలాంటి ఎవరైనా కొనుగోలు చేసి తాగడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, ఎవరైనా అమ్మితే వెంటనే ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ ఆవులయ్య సెల్‌నెంబర్ 944090425కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. జిల్లాలో బెల్లం సరఫరా చేసే వారిపై నిఘా ఉంచామని ఎవరైనా సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో బెల్లం వ్యాపారాలు వద్ద 15 రోజుల్లో ఎవరికి బెల్లం విక్రయించారో వారి వివరాలు కూడా తెలుసుకుంటున్నామన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

భీమవరం టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంటా సిరులు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అందరికీ ఆమె సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణా చేస్తే కఠినంగా శిక్షిస్తామని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నూతన ఎక్సైజ్ పాలసీ వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ సర్కిల్ పరిధిలో 56 బెల్టుషాపుల్లో దాడులు నిర్వహించి 52 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 110 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం రవాణా చేస్తున్నా తమకు సమాచారం అందించాలని కోరారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

నరసాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జరిగే జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలకు పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియం ముస్తాబవు తోంది. 19న ఫైనల్స్ జరగనున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన 30 జట్లు తలపడను న్నాయి. లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగనున్నాయి. ఈ సారి ప్రైజ్ మనీని రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెంచారు. పోటీలకు కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ వ్యవహరించనున్నారు.

హోరా హోరీగా వాలీబాల్ పోటీలు

పాలకొల్లు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలో దర్శిరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్‌ఎంవీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న కలిదిండి రామరాజు మెమోరియల్ సౌత్‌జోన్ లెవెల్ వాలీ బాల్ పోటీలు రెండో రోజు ఆదివారం రాత్రిఫ్లడ్ లైట్ల వెలుతురులో హోరా హోరీగా జరుగుతున్నాయి. మహిళలు, పురుషుల విడివిడిగా జరుగుతున్న పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ప్రాంగణం కిటకిటలాడింది. పోటీలను ఫౌండేషన్ చైర్మన్, మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆసక్తిగా తిలకించారు. మహిళల విభాగంలో కడప జిల్లా జట్టుపై కృష్ణాజిల్లా జట్టు తెలుపొందింది. సిద్దిపేట జట్టు నిజామాబాద్ జట్టుపై గెలిచింది. పురుషుల విభాగంలో శ్రీకాకుళం జట్టు తూర్పు గోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించింది. అలాగే తూర్పు గోదావరి జిల్లా జట్టు కృష్ణాజిల్లా జట్టు మీద విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టు, సాయి వైజాగ్ జట్టు మీద విజయాన్ని సాధించింది. సోమవారం 3వ రోజు సాయంత్రం ప్రథమ, ద్వితీయ స్థానాలకోసం సెమి ఫైనల్‌సకు చేరిన జట్లు తలపడనున్నాయి.



జనసేన గూటికి సోడదాసి

నరసాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరిన నాయకులకు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చినమామిడిపల్లికి చెందిన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు సోడదాసి శ్రీధర్‌తో పాటు 50 మంది జనసేనలో చేరారు. వీరికి విప్ నాయకర్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీధర్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి తాను పార్టీలో చేరినట్టు చెప్పారు. సర్పంచ్ ఈదా సురేష్ పాల్గొన్నారు.

మహంకాళమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్యూబాపేటలో శ్రీ దేవి మహంకాళమ్మ ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు నవోదయ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు తెలిపారు. అమ్మవారి 45వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా 45 కేజీల కేవలింగులలో లడ్డూ ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు.

పోటాపోటీ బరులు

భీమవరం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కోడిపందేల బరులు ఏర్పాటు పోటాపోటీగా మారింది. కొన్ని గ్రామాల్లో ఏకాభిప్రాయం లేక రెండేసి బరులు ఏర్పడ్డాయి. దీంతో గత ఏడాది కోడిపందేల బరుల తో చూస్తే రెట్టింపు బరులు వచ్చాయి. కోడి పందాలలో కోట్లాది రూపాయలు చేతులు మారనున్నాయి.

వీఐపీ రెస్ట్ బస్సు రెడీ!

కోడిపందాల వద్ద వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేసారు. వారికి రెస్ట్ కావలసిన బస్సులు తీసుకువచ్చేశారు. తెలంగాణా నుంచి వీఐపీ రెస్ట్ బస్సులు వచ్చాయి. తాడేరు గ్రామంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి వద్దకు ఆదివారం సాయంత్రానికి వీఐపీ రెస్ట్ బస్సు వచ్చేసింది.



వివేకానందుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ అప్పలనాయుడు, పొత్తూరి

యువతకు ఆదర్శం వివేకానంద

నరసాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానందుడి బోధనలు అనుసరణీయమని విజయనగరం ఎంపీ అప్పలనాయుడు అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని టేలర్ హైస్కూల్ వద్ద ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలసి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యక్తిత్వ వికాసానికి వివేక బోధనలు దోహదపడతాయన్నారు. టీడీపీ ఇన్‌చార్జి రామరాజు మాట్లాడుతూ నేటి యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 14 వార్డులోని అంబానివారిపాలెంలో కౌన్సిలర్లు కొప్పాడ కృష్ణవేణి, సూర్యకుమారి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాలకొల్లు అర్బన్: యువతను జాగృత పరిచిన మహనీయుడు స్వామి వివేకానందుడు అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక రంగమన్నారు పేటలో వివేకానంద జయంతిని వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి ఘన నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షుడు వెంకటేష్ వడయార్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు, పండ్లు మంత్రి నిమ్మల చేతుల మీదుగా అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర, సేవా సమితి గౌరవాధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: ప్రపంచ దేశాలకు భారతదేశ ఔన్నత్యాన్ని చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని అఖిల భారత హ్యండ్యూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నండ్యాల రామలింగరాజు అన్నారు. గణపవరంలో వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వివేకానంద సేవా సమితి అధ్యక్షులు అల్లూరి గంగరాజు, నడిపల్లి శ్రీరామ్, సంకు శ్రీనివాసరావు, చింతలపాటి సూర్యరాజు, నడిపల్లి కోటి, చింతలపాటి రామకృష్ణంరాజు తదితరులు వివేకాకు ఘన నివాళులర్పించారు.

తాడేపల్లిగూడెం రూరల్: స్వామి వివేకానంద రచనలు నేటి యువతకు మార్గదర్శకాలని వక్తలు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బస్టాండ్ సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలు ఆవిష్కరించారు. నాయకులు వర్మ, మురళీకృష్ణంరాజు, దాట్ల జగన్నాధరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తి దాయకమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిట్ ప్రాంగణంలో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అమ్మవారి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించిన కమిటీ సభ్యులు

నేటి నుంచి మావుళ్లమ్మ ఉత్సవాలు

రూ. 90 లక్షలతో ఉత్సవాల నిర్వహణ

భీమవరం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో మావుళ్ళమ్మ అమ్మవారి 61వ జాతర మహోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నీరుల్లి కూరగాయ వండ వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం ఆలయంలో ఉత్సవాలకు తొలుత పుణ్యాహవచనం, ఏకాదశరుద్రాభిషేకం, కలశస్థాపన, కుంకుమపూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఎమ్మెల్యే అంజిబాబు అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభిస్తారని, అనంతరం హంస వాహనంలో అమ్మవారికి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. వచ్చే నెల 11వ తేదీతో సాంస్కృతిక కార్యక్రమాలు ముగుస్తాయని, 14న అన్న సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది సుమారు రూ. 90 లక్షల వ్యయంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయం చుట్టూ ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశామని, ప్రతి ఏటా మాదిరిగానే పౌరాణిక నాటకాలు, బుర్రకథలు, హరికథలు, సంగీత విభావరి, మ్యూజికల్ నైట్స్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉత్సవాల బ్రోచర్ ను ఆవిష్కరించారు. నీరుల్లి కూరగాయ వండ వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తటవర్తి ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్యనారాయణ(సత్తిబాబు), రామాయణం చిన్ని, కట్ల కొండ, నరహరిశెట్టి సూర్యనారాయణ, రామాయణం శ్రీనివాసరావు, మానే బాన్సులరావు, మానే తేజ, ఆకుల సోమేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కమిషనర్ నరేష్, దేవస్థానం సహాయ కార్యదర్శి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 14వ వరకు అమ్మవారికి అష్టలక్ష్మి అలంకారాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



మినీ గోకుల షెడ్లు ప్రారంభం

తణుకు రూరల్/ఉండి/పెంటపాడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులం పథకంలో తణుకు నియోజకవర్గంలో 112 షెడ్ల నిర్మాణం పూర్తి చేసినట్టు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. ఆదివారం మండపాకలో రెండు మినీ గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఉండి మండలం వాండ్రంలో మినీ గోకులం(పశువుల షెడ్డు) ను ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ప్రారంభించారు. అలంపురం, కడియద్ద గ్రామాల్లో షెడ్లను ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రారంభించారు.



అంబేడ్కర్, ఫెరిస్సాల స్ఫూర్తితో రాజకీయాల్లోకి : నిమ్మల

పాలకొల్లు/పాలకొల్లు అర్బన్/రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, మదర్ థెరిస్సాల స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తికి ప్రాధాన్యమిస్తున్నానని, అలాగే పాలకొల్లులో వీలీనమైన 6 గ్రామాల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణ శివారు రూరల్ పంచాయతీలోని డామ్ పేటలో ఎంపీ నిధులు రూ. 10 లక్షలతో పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన మల్లి వర్గుస్ కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన చేగొండి హరిరామజోగయ్య మాట్లాడుతూ తాను ఏ రాజకీయ పార్టీలోనూ లేనని, రాజకీయ విశ్లేషకునిగా ఉన్నానని తెలిపారు. మంత్రి రామానాయుడు నాయకత్వంలో నియోజక వర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏప్రిల్ 5 తన పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 2లక్షలు అందిస్తానని, అలాగే మానవత ప్రతి నెలా 5వేలు చొప్పున అందిస్తానని జోగయ్య తెలిపారు. తన రాజకీయ వారసుడు తన కుమారుడు డాక్టర్ నారాయణ రావు (రాజా) అని జోగయ్య ప్రకటించారు. జోగయ్య సతీమణి డాక్టర్ భారతీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కిడ్నీ పరీక్షల శిబిరాన్ని మంత్రి నిమ్మల ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, బీజేపీ నాయకుడు ఉన్నమట్ల కబర్ది, రాజకీయ విశ్లేషకుడు చందు శ్రీనివాస్ మాట్లాడారు.



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల

యల్లాప్రగడకు ఘన నివాళి

భీమవరం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత వైద్య శాస్త్రవేత్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతి సందర్భంగా భీమవరం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఉన్నతిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మన భీమవరం వాసి అయిన యల్లాప్రగడ సుబ్బారావు వైద్య రంగంలో అద్భుతమైన పరిశోధనలు చేసి మానవాళి మనుగడకు మందులు కనిపెట్టి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, ఎం. ఏజాక్‌బాబు, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షులు అల్లు శ్రీనివాస్ యల్లాప్రగడకు నివాళులర్పించారు.

గణపవరం: యల్లాప్రగడకు భారతరత్న ప్రకటించాలని రాష్ట్ర పీఎంపీల సంఘం గౌరవ అధ్యక్షులు నిడమర్తి జయసూర్య కోరారు. గణపవరం లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో యల్లాప్రగడ జయంతి వేడుకలు నిర్వహించారు. తణుకు శ్రీనిధి హాస్పటల్‌కు చెందిన న్యూరో వైద్యనిపుణుడు కృష్ణకిషోర్ నరాలు, వెన్నుపూస, తదితర వ్యాధుల నివారణ, జాగ్రత్తలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. పీఎంపీల జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్లు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: యల్లాప్రగడ సుబ్బారావు ఆదర్శమూర్తి అని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద యల్లాప్రగడ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని యల్లాప్రగడ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



తాడేపల్లిగూడెంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



పెద అమిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వివరాలు తెలుసుకుంటున్న రఘురామ

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

కాళ్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతలో నైపుణ్యం పెంపునకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం శుభపరిణామమని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పెద అమిరంలో దాతలు ముదుండి రాజేష్ కుటుంబీకులు సహకారంతో ఏర్పాటుచేసిన లక్ష్మీ నరసింహరాజు డిజిటల్ లైబ్రరీ, ఆర్‌ఆర్‌ఆర్ ఎంప్లాయిమెంట్ స్కిల్ సెంటర్, ఆగస్త్య నెట్‌వర్క్ అకాడమీలను ఆదివారం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో కలిసి ప్రారంభించారు. సెంటర్‌లో ఏర్పాటుచేసిన డిజిటల్ లైబ్రరీ, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ ఆన్‌లైన్ క్లాస్ పరిశీలించి మాట్లాడారు. ఆహ్లాదకర వాతావరణంలో పేద విద్యార్థులకు నైపుణ్యం అందించడానికి ముందుకు వచ్చిన రాజేష్, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. రఘురామకృష్ణ రాజు, రామరాజులను ముదుండి కుటుంబీకులు సత్కరించారు. జనసేన, బీజేపీ ఉండి ఇన్‌చార్జులు జుత్తిగ నాగరాజు, కోరా రామ్మూర్తి, సర్పంచ్ సోమేశ్వరరావు, కలిదిండి నరసింహరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, ముదుండి కుటుంబీకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోపల్లె హైస్కూల్ వేదిక ప్రారంభం

75 ఏళ్ల చరిత్ర కలిగిన కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు తెలిపారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో దివంగత మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు పాతపాటి శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మ సుమారు రూ. 7 లక్షల ఆర్థిక సహకారంతో నిర్మించిన వేదిక, దాతల సహకారంతో అభివృద్ధి చేసిన ఆటస్థలాలు, ఆర్‌ఓ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. తన తండ్రి పేరిట వేదికను నిర్మించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. డీఈవో నారాయణ విద్యాశాఖ తరపున దాతలను అభినందించారు. కాళ్లకూరు గ్రామ ప్రముఖ వైద్యులు డాక్టర్ నీలాద్రిరాజు తన తండ్రి పేరిట నిర్మించిన అభివృద్ధి పనులు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో కలసి డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. సర్పంచ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.





సంక్రాంతి సంబరాల్లో భోగి మంట వెలిగిస్తున్న ఎమ్మెల్యేలు అంజిబాబు.. రఘురామకృష్ణరాజు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మొగల్తూరు,జనవరి12(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు జాతీయ రహదారి కొండాలమ్మపాలెం జంక్షన్ వద్ద జనసేన యూత్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ సంక్రాంతిని ప్రతీ ఒక్కరూ ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు.

ఉండి: సంక్రాంతి సంబరాలు ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం ఉండి మండలం వాండ్రంలో పల్లెపండుగ, సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఎంపీటీసీ అంజనీదేవిరాజు, పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, ఎంపీడీవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..

బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో...

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి గాయత్రి కల్యాణ మండపం వద్ద ఆదివారం సంప్రదాయ సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు, సంప్రదాయ పిండి వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు పుల్లాభట్ల వెంకట సూర్యనారాయణమూర్తి, కోశాధికారి ప్రవా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందరి మనసులు గెలిచే సంక్రాంతి: డీఎస్పీ

తాడేపల్లిగూడెం రూరల్: తెలుగు సంప్రదాయాలు మేళవించి అందరి మనసులను గెలిచేది సంక్రాంతి పండుగ అని డీఎస్పీ డి. విశ్వనాథ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రంలో శనివారం రాత్రి నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీవీఆర్ కళాక్షేత్రం వ్యవస్థాపకులు బుద్దాల రామారావు ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, దండగ్ర విద్యార్థులు చేసిన యోగా విన్యాసాలు, సంగీత వాయిద్యాలు, పాటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు.

యలమంచిలి: స్థానిక శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించిన వారికి గోల్డ్ కాయిన్, ద్వితీయస్థానం సాధించిన వారికి వెండి బోరిణి, అనంతర పదిస్థానాల్లో నిలిచిన మహిళలకు ప్రత్యేక బహుమతులు, పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులను 14వ తేదీ సంక్రాంతి రోజున అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న మెంటే పార్థసారథి

భీమవరం అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు.


 టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మాజీ వైస్ చైర్మన్ మెంటే గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మెంటే పార్థసారధి రూ. లక్ష చెల్లించగా మొబైల్ డిజిటల్ కార్డును మెంటే గోపి అందజేశారు. టీడీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్‌బాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు గనిరెడ్డి త్రినాథ్, రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్, పార్టీ తాడేరు గ్రామ అధ్యక్షుడు అంగర వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, 37వ వార్డు కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహోన్నత వ్యక్తి కందుల

ఆకివీడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్న గొప్ప మనసున్న వ్యక్తి కందుల సత్యనారాయణ అని పతంజలి యోగా రోగ్య కేంద్ర వ్యవస్థాపకులు డాక్టర్ బలరామ ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక పతంజలి యోగారోగ్య కేంద్రంలో ముందుగా వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం యోగా గురువు కేక్ కట్ చేశారు. శిష్య బృందం పాల్గొంది.



కాలేజీ అభివృద్ధికి నడుం కట్టాలి : కనుమూరి

ఆకివీడు రూరల్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాలేజీ అభివృద్ధికి అందరూ నడుం కట్టాలని టీడీపీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. దుంప గడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాల స్వర్ణోత్సవాల సంద ర్భంగా నిర్మించిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుజాత, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గొంట్ల కృష్ణమూర్తి, నేరెళ్ల రామచెంచయ్య, గుర్రం ఈశ్వరరావు, సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ ప్రతాప్‌కుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ తాడినాడ బాబు, పిన్నమరాజు మురళీరాజు, కర్రి రాజశేఖర్, బి ప్రసన్న దుర్గ, ఎస్‌ఆర్‌కె, దానది సత్య నారాయణ, గోపాలరావు, డియో పిలాస్, వాన పల్లి బాబూరావు, విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, మద్దాలరమేష్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లలకోడేరు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



రాయకుదురులో పూర్వ విద్యార్థులు



పెనుమంట్ర అమ్మరామానంద పూర్వ విద్యార్థులు



అలంపురం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

పాలకోడేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986-91 మధ్య కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలసి సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఆటపాటలతో గడిపారు. ఆనాటి హెడ్మాస్టర్ దయానంద రాజు, డ్రిల్ మాస్టర్ సూర్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు బాపిరాజు, సొంటి నాగేశ్వరరావు, రామలక్ష్మి, అన్నపూర్ణ, బ్రహ్మానందం తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం గురువులతో కలిసి అందరూ ఒకే వేదికపై కూర్చుని విందు భోజనాలు చేశారు.

వీరవాసరం/భీమవరం టౌన్: వీరవాసరం మండలం రాయకుదురులో 1987-88 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని సందడి చేశారు. అందే శివ శంకర్, గుడాల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ఇరగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

పెనుమంట్ర: పెనుమంట్ర అమ్మరామానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999వ సంవత్సరంలో చెందిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. చదువులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు.

పెంటపాడు: అలంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కుటుంబాలతో సహా వచ్చి ఆనందంగా గడిపారు. ఏర్పాట్లను సూరంపూడి సత్యనారాయణ, పీవీఎస్ఆర్ స్వామి, కె. దుర్గారావు తదితరులు పర్యవేక్షించారు.